I


సాక్షి పల్నాడు

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



గ్రామదేవతలకు పొంగళ్లు

నాదెండ్ల: సాతులూరు గ్రామ దేవతలు పోలేరమ్మ, వినుకొండ అంకమ్మ, ఊర అంకమ్మ, నాభిశిల, మాలక్ష్మమ్మ అమ్మవార్లకు గురువారం పొంగళ్లతో నైవేద్యాలు సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 547.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,200 క్యూసెక్కులు విడుదలవుతోంది.

లక్ష్మీ నారసింహుడికి పూజలు



ఫిరంగిపురం: నుదురుపాడులోని లక్ష్మీ నారసింహస్వామికి గురువారం విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

తెనాలిలో సదరం క్యాంప్



తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో గురువారం ప్రత్యేక సదరం క్యాంప్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఈఎన్‌టీ, ఇంకా పలు విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు సేవలు అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు. శుక్రవారం కూడ శిబిరం కొనసాగుతుందని ఆమె చెప్పారు.

బాబా ఆలయానికి వితరణ



పెదకూరపాడు : స్థానిక సాయిబాబా ఆలయంలో ధూప దీప నైవేద్యాల నిర్వహణకు పెదకూరపాడుకు చెందిన భక్తులు దర్శి సాంబశివరావు, విమల దంపతుల కుమార్తె ప్రవాస భారతీయురాలు రుచిత లక్షన్నర రూపాయలు విరాళంగా సమర్పించారు. ఉద్యోగ రీత్యా కెనడాలో స్థిరపడిన రుచిత గురువారం తన తల్లిదండ్రుల చేతుల మీదుగా సాయిబాబా ఆలయ నిర్మాణ నిర్వహణ కమిటీ సభ్యుడు గంటాబాబు, ఆలయ అర్చకుడు హనుమంతరావుశర్మకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు, విమల దంపతులను దుశ్శాలువతో సత్కరించారు.

వేద విద్యార్థి మృతిపై బాలల కమిషన్ విచారణ



నరసరావుపేటరూరల్: కోటప్పకొండలోని టీటీడీ వేద పాఠశాలలో విద్యార్థి మృతిపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గురువారం విచారణ చేపట్టింది. వేద పాఠశాలలో గత నెల 8వ తేదీన సాయిశివసూరజ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి వేద పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో వంటశాల, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. వంటశాలలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య, మానసిక పరిస్థితిని తెలుసుకునే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారని, బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పద్మావతి తెలిపారు.

శివక్షేత్రానికి 1.12 లక్షల శివలింగాకృతులు అందజేత



హనుమాన్‌జంక్షన్‌రూరల్: గుంటూరు జిల్లా అమరావతి సమీపంలోని తాళ్లాయపాలెంలో నిర్మిస్తున్న శివక్షేత్రానికి బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన భక్తులు లక్షా 12 వేల శివలింగాకృతి ప్రతిమలను పంపించారు. శివాలయం నిర్మాణంలో అధిక సంఖ్యలో భక్తులను భాగస్వాములను చేసేందుకు తాళ్లాయపాలెం శివస్వామి ఆధ్వర్యంలో ఇటీవల వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా సేవా సమితికి మట్టి అందించారు. దీంతో షిర్డీ సాయిబాబా సేవా సమితి భక్త బృందం నెలరోజుల పాటు శ్రమించి లక్షా 12 వేల శివలింగాకార ప్రతిమలను మట్టితో తయారు చేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా శివస్వామి భక్తుల ద్వారా తాళ్లాయపాలెం పంపించారు. షిర్డిసాయిబాబా సేవా సమితి సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, కట్టా సత్యవతి, ఆత్మూరి అరుణ, లంక బేబి సరోజిని, శ్రీలక్ష్మి, యలమంచిలి మాధవరావు, నామాల గాంధీ, పేర్ని ప్రవీణ, రాయి ప్రభావతి, రజని పాల్గొన్నారు.

కంది రైతు కన్నీరు

- జిల్లాలో 26,908 హెక్టార్లలో సాగు
- 50,879 మెట్రిక్ టన్నుల దిగుమతి వస్తుందని అంచనా
- రూ.7,550 మద్దతు ధరకు కొంటామన్న ప్రభుత్వం
- కొనుగోలు కేంద్రాలలో కొనడంలేదని రైతుల ఆవేదన
- సిండికేట్‌గా మారిన దాల్ మిల్లర్స్
- రూ.6 వేలకు మించి కొనుగోలు చేయని వైనం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు

పంటను అమ్ముకోవడానికి ఇబ్బందిపడుతున్న రైతులు



రైతు పొలాల్లో ఆరబెట్టిన కందులు

సాక్షి,నరసరావుపేట/దుర్గి: కంది పంట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. పండిన పంటను మార్క్‌ఫెడ్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయక ప్రభుత్వం.. సిండికేట్‌గా మారి దోచుకుంటూ కంది మిల్లుల యజమానులు రైతును కన్నీరు పెట్టిస్తున్నారు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 26,908 హెక్టార్లలో కంది పంట సాగుచేశారు. సుమారు 50,879 మెట్రిక్ టన్నుల కందులు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే దిగుబడి మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం కంది పంటకు ప్రకటించిన మద్దతు ధర రూ.7,550 మేరకు ప్రతి రైతు నుంచి సమీపంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటనలు చేశారు. తీరా చూస్తే ఇప్పటివరకు కనీసం వంద మెట్రిక్ టన్నుల కందులను కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం. ఈ విషయంపై మార్క్‌ఫెడ్ అధికారులను అడగగా బుధవారం నుంచి కందుల కొనుగోలు ప్రారంభించామని, జిల్లాలో ఇప్పటివరకు ఆరు కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. మరోవైపు తేమ శాతం పేరిట రైతుల నుంచి కందుల కొనుగోలులో మార్క్‌ఫెడ్ ప్రతిబంధకాలను సృష్టిస్తోంది. కందుల విక్రయానికి యాప్ లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటి వరకు 363 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి రైతులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం అర్థమవుతోంది.

గత ప్రభుత్వ హయాంలో దర్జాగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా కందులు రూ.10వేలకు పైగా ధర పలికింది. కొంత మంది రైతులు రూ.12 వేలకు కూడా అమ్ముకున్నారు. దీంతో ఈ ఏడాది కంది పంట సాగుకు రైతులు ఉత్సాహం చూపారు. అయితే ప్రభుత్వం ఈ ఏడాది రూ.7,550 మద్దతు ధర ప్రకటించింది. తీవ్ర వాతావరణ అనుకూలతలు, చీడపీడల మధ్య పండిన అరకొర పంటను ఆ ధరకైనా అమ్ముకుందామన్న రైతులకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రైతులకు అన్నదాత సుఖీభవ లాంటి పథకాల ద్వారా ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా కనీసం పండిన పంటను అమ్ముకోలేని దుస్థితికి తెచ్చారని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందాల్సిన సాయం సక్రమంగా అందడంతోపాటు దిగుబడులను దళారుల దోపిడీ లేకుండా అమ్ముకున్నామని వారు చెబుతున్నారు.



దుర్గి మండలం ముటుకూరులో కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం

సిండికేట్‌గా మారి దోపిడీ

కందుల కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న మిల్లు యజమానులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి దోచుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ధరలు పతనమయ్యాయన్న పేరుతో క్వింటా రూ.6,000 నుంచి రూ.6,200 మధ్య కొనుగోలు చేస్తున్నారు. అది కూడా రైతులే నేరుగా దాల్ మిల్లుల వద్దకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. రైతుల వద్దకు వ్యాపారులు ఎవరూ వెళ్లి కొనుగోలు చేయకూడదని, ఒకవేళ అలా చేస్తే ఆ వ్యాపారికి రూ.లక్ష జరిమానా విధిస్తామని సిండికేట్ అల్టిమేటం జారీ చేసినట్టు ప్రచారం నడుస్తోంది. వ్యాపారులు ఇంతలా దోపిడీకి రంగం సిద్ధం చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడా వ్యాపారులు, రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి కొనుగోలు కేంద్రాలలో కందులు కొనటం లేదని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆత్మహత్యలే శరణ్యం...



ఎన్నో వ్యయ ప్రయాసలు పడి కంది పంటను పండిస్తే కనీసం కొనే నాథుడే రాకపోవడం దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలు రూ.7,550 లభించడం లేదు. ఎకరానికి రెండు క్వింటాలు మాత్రమే దిగుబడి వస్తుండటంతో సుమారుగా రూ.20 వేలకు పైగా నష్టం వాటిల్లుతోంది. ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా లేదు. కంది రైతులకు కూడా పత్తి, మిర్చి రైతుల వలె ఆత్మహత్యలే శరణ్యం.

–పేరుపోగు రామయ్య,
రైతు, ముటుకూరు, దుర్గి మండలం.

కొనే నాథుడే కరువయ్యాడు...



నేను నాలుగు ఎకరాలలో కంది పంట సాగు చేశాను. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పంట అమ్ముకుందామంటే కొనేవారు ఎవరు ముందుకు రావడం లేదు. ఈ సంవత్సరం దిగుబడి కూడా బాగా తగ్గింది. గత సంవత్సరం క్వింటా కంది రూ.10 వేలకు పైగా ధర పలకడంతో ఎన్నో ఆశలతో ఈ సంవత్సరం నాలుగు ఎకరాలు సాగు చేశాను. ఇప్పటివరకు ఏ ప్రభుత్వ అధికారి కానీ, ప్రజాప్రతినిధి కానీ మా గోడు పట్టించుకో లేదు. ఇలాంటి దుస్థితి వస్తుందని ఊహించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని కనీసం మద్దతు ధర రూ.7,550కు కందులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

–ఉప్పు శ్రీనివాసరావు, దుర్గి.

చిట్ ఫండ్ యాజమానికి 14 రోజుల రిమాండ్

గుంటూరు జిల్లా కారాగారానికి తరలింపు

నగరంపాలెం: నరసరావుపేట పట్టణంలోని సాయిసాధన చిట్ ఫండ్ సంస్థ యాజమాని పాలడుగు పుల్లారావుకు 14 రోజుల రిమాండ్ విధించారు. అతనిపై పల్నాడు జిల్లాతోపాటు గుంటూరు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 43 మందికి పైగా బాధితులు ఫిర్యాదు చేయగా, మోసపోయిన జాబితాలో మరి కొంత మంది ఉన్నారు. బాధితులకు సుమారు పది కోట్ల రూపాయలకు పైగా మోసగించినట్లు పోలీసులు తెలిపారు. అతనిపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు వస్తున్నారని, ఎన్ని కోట్ల రూపాయలకు మోసగించారనేది మరో పది రోజుల్లో తేలనుందని తెలిపారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతను గురువారం జిల్లా కోర్టుకు వచ్చారు. గుంటూరు ఎక్సైజ్ కోర్టులో హాజరైన పుల్లారావుకు 14 రోజుల రిమాండ్‌ను ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి స్పందన విధించారు. అనంతరం పుల్లారావును గుంటూరు నగరంలోని జిల్లా కారాగారానికి తరలించారు.

విజయకీలాద్రిపై శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గురువారం సకల విద్యాప్రాప్తి కోసం హయగ్రీవ హోమాన్ని, హనుమద్వాహన సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విజయకీలాద్రి దివ్య క్షేత్ర 8వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 8.30 గంటలకు హయగ్రీవ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను, సాయంత్రం శ్రీనివాసునికి అశ్వవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ప్రగతి..అదే పీ–4 పాలసీ లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు



కలెక్టరేట్ నుంచి వీడియా కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పీ–4 పాలసీని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి పీ–4 ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నీ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి రానున్న ఉగాదిన ప్రారంభించ తలపెట్టిన పీ–4 పాలసీ అమలుపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా జిల్లా జనాభాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు అత్యంత ప్రాధాన్యతతో ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎన్జీవోలు, ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపారస్తులు, స్థానిక నాయకులు వివిధ రంగాల నిపుణులను భాగస్వామ్యం, వారి నైపుణ్యం, వనరులు, మార్గదర్శకత్వాన్ని పంచుకోవడం ద్వారా పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. జీరో పావర్టీ, పి–4, నియోజకవర్గ విజన్ ప్లాన్‌ను ఒక సమష్టి శక్తిగా అమలు చేయాలన్నారు. అందుకు సంబంధించి రాబోయే 30 రోజుల్లో ప్రభుత్వం పీ–4 విధానంపై అందరి ఆలోచనలు, అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి అవసరాలు, ఆకాంక్షలను ప్రతిబింబించే విధానాన్ని రూపొందించడంలో ప్రతి ఒక్కరూ అంతర్భాగంగా చొరవ చూపాలన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించడానికి పబ్లిక్ కన్సల్టేషన్ కోసం రూపొందించిన ప్రశ్న పత్రం సర్వేను ప్రణాళికా విభాగం సిద్ధం చేస్తుందన్నారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి ఏడు నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వేలో జిల్లా పౌరులను భాగస్వామ్యం చేసే లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. స్వర్ణ ఆంధ్ర విజన్ 2047ను సక్రమంగా అమలు చేయడానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సమష్టిగా కృషి చేస్తూ రానున్న ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో ఎ.మురళి, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి

- సత్తెనపల్లి ఆర్డీఓ రమణకాంతరెడ్డి
- మహా శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంతరెడ్డి

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అమరేశ్వరాలయంలో నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల మొదటి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన వివిధ ప్రభుత్వ శాఖల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి, 27వ తేదీ రథత్సవం ఉంటుందని, భక్తులు అమరావతి చేరుకోవటానికి గుంటూరు నుంచి ప్రతి 10నిముషాలకు ఒక బస్‌సర్వీస్, సత్తెనపల్లి, విజయవాడ డిపోల నుంచి అవసరమైన బస్సు సర్వీస్‌లు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉత్సవాలలో శాంతి భద్రతలను కాపాడటం కోసం సుమారు 200 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు స్థానిక సీఐ అచ్చియ్య తెలిపారు. దేవాలయంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తామని, అత్యవసర సమయంలో ఇబ్బంది లేకుండా 60 కేవీ జనరేటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. దేవాలయంలో పారిశుద్ధ్య నిర్వహణకు మూడు షిఫ్టులలో 80 మంది ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామని, దుస్తులు మార్చుకునేందుకుగాను కృష్ణానది ఒడ్డున 10 తాత్కాలిక గదులను ఏర్పాటు చేస్తున్నామని దేవాలయ ఈఓ సునీల్‌కుమార్ తెలిపారు. ప్రమాదాలు జరగకుండా నదిలో పడవలను ఏర్పాటు చేసి వాటిపై గజ ఈతగాళ్లను నియమిస్తామని మత్స్యశాఖ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ డ్రై డేలను అమలు చేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆర్డీఓ మాట్లాడుతూ దేవాలయ అధికారులతో మిగిలిన అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని అన్నారు. ఉత్సవాల రెండురోజులు దేవాదాయశాఖ చీఫ్ ఫెస్టివల్ అధికారితో కలసి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.రవి, తహసీల్దార్ దానియేల్‌తోపాటు వివిధశాఖల మండల స్థాయి అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డిగ్రీ మూల్యాంకనం

- నరసరావుపేట కేంద్రంపై ఆరోపణల వెల్లువ
- మూల్యాంకనానికి తగిన సమయం కేటాయించని వైనం
- మార్గదర్శకాలు విడుదల చేయాలంటున్న అధ్యాపకులు

గుంటూరు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల మూల్యాంకనంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ పరిధిలో గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాలుగా మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 3, 5 సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం పూర్తి చేశారు. ప్రస్తుతం 1 సెమిస్టర్ పరీక్ష మూల్యాంకనం కొనసాగుతున్నది. ఆయా కేంద్రాలపై వర్సిటీ పరీక్షల విభాగం పర్యవేక్షణ కొరవడటంతో కేంద్రాల నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రధానంగా నరసరావుపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంపై పలు ఆరోపణలు వినవస్తున్నాయి.

మూల్యాంకనకు సమయమేది..?

సాధారణంగా మూల్యాంకనకు రోజులో 5 నుంచి 6 గంటల సమయం కేటాయిస్తారు. రోజుకు 30 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. అయితే నరసరావుపేట కేంద్రంలో మాత్రం మూల్యాంకనకు ఇచ్చే సమయం మాత్రం మూడు గంటలు మాత్రమే. ప్రతి రోజూ సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ఇక్కడ సమయమిస్తారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల ప్రాంతాలకు చెందిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులు నరసరావుపేటలో మూల్యాంకనానికి హాజరవుతారు. మాచర్ల, గురజాల వంటి ప్రాంతాలు దూరంగా ఉండటంతో అక్కడి అధ్యాపకులు ఎప్పటినుంచో హాజరు కావటం లేదు. మూల్యాంకన సమయాలను మార్చకపోవటంతో అధ్యాపకులు తీవ్ర ఒత్తిడితో పాల్గొంటున్నారు. 6 నెలలపాటు చదివిన విద్యార్థి భవితవ్యాన్ని ఆరు నిమిషాలలో తేల్చివేస్తున్నారు.

అధ్యాపకులకు మార్గదర్శకాలు ఏవి?

మూల్యాంకనకు హాజరయ్యే అధ్యాపకులకు వర్సిటీ ఎటువంటి మార్గదర్శకాలను అందివ్వక పోవటంతో కేంద్రం నిర్వాహకులు చెప్పిందే వేదంగా మారిందంటున్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టిన డిగ్రీ ఆనర్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఒక్కో పేపర్‌ను ఇద్దరు, ముగ్గురు వేర్వేరు సబ్జెక్ట్‌ల అధ్యాపకులు బోధించాల్సి ఉంటుంది. అయితే సదరు పేపర్ జవాబు పత్రాన్ని ఎవరు మూల్యాంకనం చేయాలనే దానిపై వర్సిటీ పరీక్షల విభాగంలోనే సరైన అవగాహన లేదు. దీంతో మూల్యాంకన కేంద్రం నిర్వాహకులు తమకు తోచిన, తమ వారికే మూల్యాంకనం చేసేందుకు కేటాయిస్తుండటంతో మిగిలిన అధ్యాపకులు వేదనకు గురవుతున్నారు. వీటితో పాటు మల్టీ డిసిప్లీనరీ పేపర్, స్కిల్ పేపర్‌లను సబ్జెక్ అధ్యాపకులతో సంబంధం లేకుండా ఇతరులు సైతం మూల్యాంకన చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నరసరావుపేట కేంద్రంలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుల మధ్య ఇటువంటి వివాదమే తలెత్తినట్టు తెలిసింది. వివాదంతో వారం రోజులపాటు ఎవరికీ కేటాయించని జవాబు పత్రాలను కామర్స్ అధ్యాపకులకు కేటాయించినట్టు చెబుతున్నారు.

హాజరు కాని వారి పేరు మీద బిల్లులు

మూల్యాంకనకు హాజరు కాని అధ్యాపకుల పేరు మీదుగా బిల్లుల చెల్లింపులు జరిగినట్టుగా చెబుతున్నారు. నాన్‌లోకల్ డీఏ అధికంగా ఉండటంతో కొందరు లోకల్ అధ్యాపకులు నాన్‌లోకల్ అధ్యాపకుని ఐడీ నెంబర్‌ను ఉపయోగించి బిల్లులు తీసుకుంటున్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. మూల్యాంకన కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తి మరొకరి ఐడీ ఉపయోగించిన సంగతి వెలుగులోకి రావటంతో వర్సిటీ అధికారులు చివాట్లు పెట్టినట్టు తెలిసింది.

ఈ సీజన్‌లో ఇదే ప్రథమం

- యార్డుకు 1,36,176 బస్తాల మిర్చి
- మొత్తం 1,33,436 బస్తాల అమ్మకం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం భారీ స్థాయిలో ఈ సీజన్‌లో ప్రథమంగా 1,36,176 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,33,436 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.13,200 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,902 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం

- అర్ధరాత్రి డిపోలో భారీగా ఎగసి పడిన మంటలు
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని అనుమానం
- రూ.కోటి పైగా నష్టం ఉంటుందని అంచనా



తగలబడిపోయిన కారు

పర్చూరు(చినగంజాం): బాపట్ల జిల్లా పర్చూరులోని ఓ టింబర్ డిపోలో బుధవారం అర్ధరాత్రి తీవ్ర అగ్ని ప్రమాదం సంభవించింది. పర్చూరు–చీరాల రోడ్డులో ఉన్న నాగేశ్వరి టింబర్ డిపోలో అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలు భారీగా ఎగిసి పడటంతో డిపో చుట్టు పక్కల గృహాలు, దుకాణాల వారు అప్రమత్తమయ్యారు. ఇళ్లలో ఉన్న నీటితో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. టింబరు డిపోలో ఉన్న దుంగలకు మంటలు అంటుకోవడంతో టింబర్ డిపో అంతా ఒక్కసారిగా వ్యాపించాయి. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న ఎస్‌ఐ మాల్యాద్రి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. చీరాల, చిలకలూరిపేట, బాపట్ల నుంచి అగ్నిమాపక దళాలను రప్పించారు. నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదంలో టింబర్ డిపోలోని దుంగలతోపాటు ఒక కారు కూడా పూర్తిగా దగ్ధం కావడంతో జరిగిన నష్టం రూ.కోటికి పైగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రీజనల్ ఫైర్ అధికారి జిలాని, జిల్లా ఫైర్ అధికారి మాధవ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని కారణాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి కారణాలను తెలుసుకునేందుకు క్లూస్ టీంని రంగంలోకి దించారు. డిపో మేనేజర్ శేషబ్రహ్మచారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో టింబర్ డిపోలో మంటలు వ్యాపించాయని తనకు ఫోన్ వచ్చిందని శేషబ్రహ్మచారి తెలిపారు. సమాచారం అందిన వెంటనే టింబర్ డిపోకు వెళ్లి చూడగా డిపో అంతా మంటలు వ్యాపించి ఉన్నాయని పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

వ్యాయామంతో మానసిక రుగ్మతలు దూరం



ఏఎన్‌యూ: వ్యాయామం, యోగ వంటి వాటితో మానసిక రుగ్మతల నుంచి బయటపడవచ్చునని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధర రావు పేర్కొన్నారు. 'మేనేజింగ్ స్ట్రెస్ డిప్రెషన్ టూ ఎన్ హాస్ సైకలాజికల్ క్యాపిటల్' అనే అంశంపై వర్సిటీలోని సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ పని ఒత్తిడి సర్వసాధారణమైన విషయమన్నారు. సాంకేతిక విజ్ఞానం పెరిగే కొద్దీ మానసిక సమస్యలు అధికం అవుతున్నాయని వివరించారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె. వీరయ్య, పాలకమండలి సభ్యులు ఇండ్ల రాధ, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి. చెన్నారెడ్డి, సదస్సు డైరెక్టర్ ఆచార్య టీడీ విమల తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు

లక్ష్మీపురం: ఎన్‌టీఆర్‌సీఎస్‌డీ, ఈడబ్ల్యూ గుంటూరు (మహిళా ప్రాంగణం)నకు ఏపీఎస్ఎస్‌డీసీ వారు జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (మెడికల్ అండ్ హెల్త్), ఫ్యాబ్రిక్ కట్టర్ (దుస్తుల తయారీ) నాన్ రెసిడెన్షియల్ స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులను మంజూరు చేశారు. ఈ మేరకు జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ బి.రమణశ్రీ గురువారం తెలిపారు. ఉచితంగా శిక్షణ ఉంటుందని, దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 83339 21371 లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

పట్నంబజారు: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 12న పౌర్ణమి సందర్భంగా గుంటూరు నుంచి బస్సు ఉంటుందన్నారు. 10న రాత్రి 9 గంటలకు గుంటూరులో బయల్దేరి 11న కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. 12న ఉదయం భక్తుల గిరిప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం సాయంత్రం బస్సు బయల్దేరి 13న ఉదయం గుంటూరు చేరుకుంటుందని పేర్కొన్నారు. వివరాలకు 73828 97459 ఫోను నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

పోలీసులకు ధ్యానం, యోగా అవసరం

ఆర్మడ్ రిజర్వ్ పోలీసుల శిక్షణలో ఎస్పీ శ్రీనివాసరావు



శిక్షణలో పాల్గొన్న ఆర్మడ్ రిజర్వు పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: పోలీసు సిబ్బంది శారీరక ధృఢత్వాన్ని పెంపొందించేందుకు, మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహించటం చాలా అవసరమని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆర్మడ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందికి 15 రోజుల పాటు యానువల్ మొబలైజేషన్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇది ఏఆర్ పోలీసులకు ప్రతి ఏడాది పోలీసుల సామర్థ్యాలు మెరుగుపరచడం, ఆధునిక ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించడం, క్రమశిక్షణను బలోపేతం చేయడం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టడం లాంటి అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిబాబు పాల్గొని సిబ్బందికి ఆయుధాలను సమయోచితంగా ఉపయోగించే విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన మెలకువలు, సంరక్షణ పద్ధతులు తెలియజేశారు. ఆయుధాల నిర్మాణం, వాటి పనితీరు, శత్రువుపై దాడి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కవాతు-మాబ్ కంట్రోల్ శిక్షణ ద్వారా పోలీసులు అత్యవసర పరిస్థితులలో గుంపును ఎలా నియంత్రించాలి, ప్రజా రక్షణలో మాబ్ కంట్రోల్ టెక్నిక్స్, వ్యూహాత్మక విధానాలు, బందోబస్తు విధులు, ముఖ్యమైన వ్యక్తుల భద్రత, ప్రిజనర్స్ ఎస్కార్ట్, గార్డు డ్యూటీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సెక్యూరిటీ ప్రోటోకాల్ గురించి వివరించారు. బీడీ టీం, డాగ్ స్క్వాడ్, పీఏ స్వోలు, డ్రైవర్లు తదితర విభాగాల్లో సేవలందిస్తున్న ఏఆర్ పోలీసు సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ, అడ్మిన్, వెల్ఫేర్, హోంగార్డు ఆర్ఐలు, రాజా, గోపీనాథ్, కృష్ణ, పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో బంగారు పతకం



నేపాల్ ప్రధానమంత్రి మాధవ్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్న అనూరాధరెడ్డి

కర్లపాలెం: అంతర్జాతీయ స్థాయిలో నేపాల్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు అనూరాధరెడ్డి బంగారు పతకం సాధించింది. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ చదువుతున్న అనూరాధరెడ్డి కళాశాల తరపున ఆంధ్రా నుంచి ఏషియన్ గేమ్స్‌లో బాలికల విభాగంలో షూటింగ్ బాల్ పోటీలలో 12 మంది సభ్యులు ఉండే ఇండియా జట్టు తరపున పాల్గొంది. ఫిబ్రవరి 2, 3వ తేదీలలో నేపాల్‌లోని ఇటిహార్ జిల్లాలో జరిగిన షూటింగ్ బాల్ పోటీలలో ఇండియా టీమ్, నేపాల్ టీమ్‌పై ఆడి ఫైనల్స్‌లో విజయం సాధించి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఇండియా టీమ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొని మెరుగైన ప్రతిభ కనబరిచిన అనూరాధరెడ్డి నేపాల్ ప్రధాన మంత్రి మాధవ్‌కుమార్ చేతుల మీదుగా బంగారు పతకం, మెమోంటో అందుకుని గురువారం స్వస్థలానికి చేరుకుంది. అనంతరం కర్లపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజును అనూరాధరెడ్డి తన తల్లిదండ్రులు పిట్టు సుబ్బారెడ్డి, నాగలక్ష్మిలతోపాటు కలిసింది. ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు అనూరాధరెడ్డికి పూలమాలవేసి శాలువాకప్పి సన్మానించారు.

సముద్రంలో వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు

కేసు నమోదు చేసిన పోలీసులు



మత్స్యకారుడు రమణ (ఫైల్)

చీరాల టౌన్: వేటకు వెళ్లిన మత్స్యకారుడు సముద్రంలో గల్లంతైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళితే.. మండలంలోని వాడరేవు గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఓసిపిల్లి రమణ (57) సముద్రంలో వేట చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రమణ, మరో ముగ్గురు కలిసి సముద్రంలో వేట చేసేందుకు బోటులో వాడరేవు నుంచి కృష్ణాజిల్లా నాగాయలంక తీరప్రాంతం వైపు వేటకు వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి బోటులో నిద్రిస్తుండగా మత్స్యకారుడు రమణ ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయాడు. తోటి మత్స్యకారుల సాయంతో తీరంలో గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గల్లంతైన రమణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వాడరేవు నుంచి మూడు బోట్లలో పదిహేను మంది మత్స్యకారులు సముద్రంలో గాలిస్తూ తీరప్రాంత గ్రామాల మత్స్యకారులకు సమాచారం అందించారు. గల్లంతైన రమణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రమణ గల్లంతై నాలుగు రోజులు కావస్తున్నా నేటికీ ఆచూకీ తెలియరాలేదు. ఈమేరకు ఈపురుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ గల్లంతైన రమణ కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు.

బియ్యం నిల్వల్లో తేడాలుంటే చర్యలు



మంగళగిరి: ఎంఎల్ఎస్ పాయింట్‌లలో రేషన్ బియ్యం నిల్వలలో తేడాలుంటే ఉపేక్షించే ప్రసక్తే లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లను కమిషనర్ పరిశీలించారు. నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. హమాలీల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతినెలా అందరికీ తప్పనిసరిగా రేషన్ అందించాలని ఆదేశించారు. రేషన్ బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

పశువుల రక్షణకు రేడియం స్టిక్కర్లు



వెంకటపాలెం (తాడికొండ): రోడ్డుపై సంచరించే సమయంలో పశువులకు ప్రమాదం జరగకుండా రేడియం స్టిక్కర్లు తప్పనిసరి అని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బబిత అన్నారు. గురువారం రాజధాని ప్రాంతం వెంకటపాలెంలో పశువులకు రేడియం స్టిక్కర్లు, ట్యాగ్‌లు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో తరచూ పశువులను వాహనాలు ఢీకొంటున్న ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూగజీవాలను కాపాడేందుకు అందరూ ఇలా పశువులకు స్టిక్లర్లు వేయించాలని కోరారు. ఉప కార్యదర్శి అమర లింగేశ్వర రావు, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐలు గంగా వెంకటేశ్వర్లు, బి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు విఘాతం కలిగించొద్దు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



సమీక్ష నిర్వహిస్తున్న పద్మావతి

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్లలో బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు బత్తుల పద్మావతి అధికారులను ఆదేశించారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే కోటప్పకొండ తిరునాళ్లలో బాలల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు, సీడీవోపీవో ఉమామహేశ్వరి, బాలల సంరక్షణ అధికారి వి.ప్రశాంతి పాల్గొన్నారు. తిరునాళ్లకు బాలలు, చంటిపిల్లలు, బాలింతలు ఎంతమంది వస్తారు అని ప్రశ్నించారు. ఆలయంలో వీరికోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి వీరికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బాల యాచకులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తిరునాళ్లలో తప్పిపోయిన బాలలను తల్లిదండ్రుల చెంతకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాలలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా తిరునాళ్లను పూర్తిచేయాలని తెలిపారు.

ఐదు నెలల తరువాత రీపోస్టుమార్టం!

పున్నమ్మ మృతదేహానికి పంచనామా



పంచనామా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్న అధికారులు

పిడుగురాళ్ల: గత ఏడాది మృతి చెందిన మారం పున్నమ్మ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేసిన సంఘటన గురువారం పిడుగురాళ్ల పట్టణంలోని బెల్లంకొండ డొంకలోని పొలంలో జరిగింది. పట్టణ ఎస్ఐ మోహన్ కథనం ప్రకారం.. పట్టణానికి ఎందిన మారం పున్నమ్మ (84) 2024 ఆగస్టు 5న మృతి చెందింది. అయితే మృతురాలి కుమారుడు మారం రమణారెడ్డి ఫిర్యాదు మేరకు రీ పోస్టుమార్టం నిర్వహించాల్సి వచ్చిందన్నారు. లక్ష్మీ నారాణయమ్మ చంపి ఉంటుందని అనుమానంతో రమణారెడ్డి కోర్టును ఆశ్రయించి ఫిర్యాదు చేశారని, కోర్టు ఆదేశాల మేరకు బెల్లం రామారెడ్డి పొలంలో ఉన్న సమాధిని తవ్వి పున్నమ్మ మృతదేహాన్ని వెలికితీశారు. పోరం సిక్కు వైద్యులు హాజరై రీ పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ మధుబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్ఐ మోహన్‌కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతోపాటు రెవెన్యూ, పోలీస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు తప్పనిసరిగా బీమా చేయించాలి

ఫిషరీస్ జిల్లా అధికారి కృష్ణకిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఫిషరీస్ జిల్లా అధికారి కృష్ణకిషోర్

కర్లపాలెం: ఆక్వాసాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఫిషరీస్ జిల్లా అధికారి కృష్ణకిషోర్ చెప్పారు. గురువారం కర్లపాలెంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆక్వా రైతులకు ఇన్‌స్ట్రూ ఫిషరీస్, నేషనల్ ఫిషరీస్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఫిషరీస్ అధికారి మాట్లాడుతూ ఆక్వా రైతులు సాగు చేస్తున్న చేపలు, రొయ్యలకు ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం సంభవించినప్పుడు బీమా చేసుకున్న రైతులకు ఆర్థికంగా ఆసరా కలుగుతుందని చెప్పారు. సొంత పట్టా భూములు ఉండి చెరువులలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు సీఏఏ లైసెన్సు, అసైన్డ్ భూములలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు, సీఓసీ చేస్తున్న రైతులు బీమా తీసుకోవాలని చెప్పారు. ఎఫ్‌డీఓ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్వా సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీ సైదానాయక్, ఫిషరీస్ అసిస్టెంట్ సద్దామ్‌హుస్సేన్, షేక్ సల్మా, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న బాలుడు
- రూ.1.50ల నగదుతోపాటు 80 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్‌నాయక్, పక్కనే రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: చోరీ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా క్రైమ్ డీఎస్పీ జగదీష్‌నాయక్ చెప్పారు. పట్టణ సర్కిల్ కార్యాలయంలో గురువారం నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. గత ఏడాది నవంబర్ 17న జగనన్న కాలనీలోని జగదీశ్వరరావు గృహంలో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చోరీకి పాల్పడింది నిజాంపట్నానికి చెందిన బాలుడిగా గుర్తించారు. అతడు రేపల్లె పరిసర ప్రాంతాలతోపాటు తెనాలి, విజయవాడ, బాపట్ల ప్రాంతాలలో చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. పగటి వేళల్లో తాళాలు వేసి ఉన్న గృహాలను పరిశీలించి రాత్రుళ్లు బాలుడు చోరీలకు పాల్పడుతుంటాడని తేలింది. అపహరించిన బంగారు నగలను నిజాంపట్నం మండలం మిరియాలవారిపాలెంకు చెందిన నూతన్‌బాబుకు అందించేవాడు. నూతన్‌బాబు ఆభరణాలను ముక్కముక్కలుగా చేసి అమ్మేవాడు. విశ్వసనీయ సమాచారంతో చెరుకుపల్లిలో ఉన్న బాలుడిని అరెస్టు చేసి ఆ తర్వాత బాలుడు ఇచ్చిన సమాచారంతో నూనత్‌బాబును తెనాలిలో అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1.5లక్షల నగదు, 80 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని.. దాడి చేశాడు



చికిత్స పొందుతున్న మస్తాన్‌వలి

తెనాలి రూరల్: అప్పు అడిగితే ఇవ్వలేదన్న కోపంతో గుంటూరు జిల్లా తెనాలి బాలాజీరావుపేటకు చెందిన కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీరావుపేటకు చెందిన షేక్ మస్తాన్ వలి కార్పెంటర్ పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో వార్ఫ్ రోడ్డులో కోత మిషన్ వద్ద ఉండగా నంబర్ ప్లేటు లేని కారులో వచ్చిన కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ బేగ్, మరో ముగ్గురు కలిసి మస్తాన్ వలిని బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. తక్కెళ్లపాడు వరకు కొట్టుకుంటూ తీసుకువెళ్లి అక్కడ పెట్రోలు బంకులో మస్తాన్ వలి నుంచి ఫోన్‌పే ద్వారా రూ. ఐదు వేలు బలవంతంగా చెల్లించారు. తర్వాత పెదకాకాని-మంగళగిరి మీదుగా విజయవాడ తీసుకువెళ్లారు. దారి పొడవునా కర్రలు, చేతులతో విచక్షణరహితంగా కొట్టారని బాధితుడు వాపోయారు. అట్లాగే ఇబ్రహీంపట్నం తీసుకువెళ్లి మళ్లీ తెనాలి తీసుకొచ్చారు. కౌన్సిలర్ ఇంటి వద్దకు తీసుకురాగా, అక్కడ నుంచి తప్పించుకొని బయటపడినట్లు బాధితుడు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా తనను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అహ్మద్ అడిగిన డబ్బులు తాను ఇవ్వనందుకే ఈ దాడికి పాల్పడ్డాడని కన్నీటి పర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న తెనాలి త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు రాత్రి 12 గంటల సమయంలో వైద్యశాలకు వచ్చి బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. అహ్మద్‌పై పలు కేసులు ఉన్నాయని, ఇటీవల రౌడీషీట్ తెరిచామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు శారద కాలనీలో నివాసం ఉండే గండి డేవిడ్‌రాజు కుమారుడు సంజయ్ (34) గుంటూరులో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం పోలకంపాడులో తెలిసిన వారు మృతి చెందడంతో చూసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో బైకుపై తిరిగి ఇంటికి వెళుతుండగా మంగళగిరి నుంచి విజయవాడ వెళ్తున్న కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన సంజయ్‌ను ఓ ప్రైవేటు వాహనంలో విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంజయ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రాజధానిలో పనులకు వచ్చిన ఒడిశా యువకుడికి పాముకాటు

చికిత్స పొందుతూ విజయవాడ జీజీహెచ్‌లో మృతి

తాడికొండ: రాజధాని నిర్మాణ పనుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఒడిశా కార్మికుడు పాముకాటుకు బలై మృతి చెందిన ఘటన తుళ్ళూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన సూరజ్ రాయ్(28) అనే యువకుడు తుళ్ళూరు శివారులో నిర్మాణంలో ఉన్న ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో సెంట్రింగ్ పనిచేసేందుకు వచ్చాడు. మంగళవారం రాత్రి తిని నిద్రకు ఉపక్రమించగా.. బుధవారం వేకువ జామున 3 గంటలకు పాము కరిచింది. దీంతో స్థానిక కూలీలు తుళ్ళూరు పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం బాధితుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కలగయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ నాస్తిక మేళా



తెనాలి: గుంటూరు జిల్లా మంగళగిరి దగ్గర్లోని చార్వాక ఆశ్రమంలో ఈ నెల 8, 9 వ తేదీల్లో నాస్తిక సమాజం ఆధ్వర్యంలో 33వ జాతీయ నాస్తికమేళా జరుగుతుందని తెనాలి డివిజన్ నాయకుడు ఆర్.శివ కృష్ణ చెప్పారు. నాస్తిక సమాజం కార్యాలయంలో గురువారం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమాజం నాయకుడు కె.బెనహర్‌బాబు, నందూరి నారాయణరావులు మాట్లాడుతూ.. మేళాలో భౌతికవాదానికి సంబంధించిన ఉపన్యాసాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అభ్యుదయవాదులంతా పాల్గొనాలని కోరారు.

బాలకోటయ్య తిరునాళ్లు జయప్రదానికి కృషి చేయాలి

ఉప కమిషనర్ శ్రీనివాసరావు



అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని పర్యవేక్షిస్తున్న ఉప కమిషనర్ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: మహాశివరాత్రి సందర్భంగా అవరపల్లి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లను జయప్రదం చేయాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. అరవపల్లి గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరునాళ్ళకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయంతో పనిచేసి వసతులు కల్పించాలని సూచించారు. స్వామి దర్శనానికి అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పొంగళ్లు పొంగించేందుకు, తలనీలాల సమర్పణకు వసతులు కల్పించాలన్నారు. ప్రభలను భక్తులు తీసుకువచ్చే సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు. పకడ్బందీ బందోబస్తు పెట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్, ప్రసాదాల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆయన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.